సాక్షి
నిజామాబాద్
గురువారం । 30 । మే । 2024



ముగ్గురి అరెస్ట్

అల్ప్రాజోలం సరఫరా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమయ్య తెలిపారు.

- 8లో ▸



మృత్యు కూపాలుగా..

జిల్లాలోని చాలా వరకు చెరువుల్లో భారీ గుంతలు తవ్వడంతో మృత్యు కూపాలుగా మారాయి.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40.1 /29.7

ఉదయంనుంచే ఎండ తీవ్రత కొనసాగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమవుతుంది.

ఉత్కంఠగా ఎదురుచూపు!

- కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్
- పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఇంకా ఐదు రోజులే..
- సెగ్మెంట్లు, బూత్‌ల వారీగా వచ్చే ఓట్ల విషయమై అభ్యర్థుల లెక్కలు

పార్లమెంట్ ఎన్నికల ఫలితాలకు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు, పార్టీ శ్రేణుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల్లో త్రిముఖ పోటీ నడిచినప్పటికీ రెండు జాతీయ పార్టీల మధ్యే నువ్వా నేనా అనే స్థాయిలో పోరు జరిగింది.









సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఉత్కంఠగా ఎదురుచూస్తున్న పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఇంకా ఐదు రోజులు మాత్రమే మిగిలి ఉంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు, శ్రేణులతో పాటు ఆసక్తి కలిగిన వివిధ వర్గాల వారంతా పోలింగ్ పూర్తయిన నాటినుంచి రోజుల వారీగా లెక్కపెట్టుకుంటూ వస్తున్నారు. కౌంటింగ్ ప్రక్రియ కోసం ఇక గంటలవారీగా ఎదురు చూసే తరుణం వచ్చింది. పోలింగ్ పూర్తయ్యాక వారం రోజుల పాటు కూడికలు, తీసివేతలతో సెగ్మెంట్లు, బూత్‌ల వారీగా లెక్కగట్టుకుంటూ గడిపిన ప్రధాన పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు మళ్లీ ఇప్పుడు అదే పనిలో పడ్డారు.

■ నిజామాబాద్ లోక్‌సభ స్థానంలో 2019 ఎన్నికల్లో పసుపు బోర్డు అంశంతో బీజేపీ నుంచి ఎన్నికల బరిలోకి దిగిన ధర్మపురి అర్వింద్ అప్పటి సిట్టింగ్ బీఆర్‌ఎస్ ఎంపీ కల్వకుంట్ల కవితపై ఘనవిజయం సాధించారు. అర్వింద్‌కు 4,80,584(45.22 శాతం) ఓట్లు వచ్చాయి. కవితకు 4,09,709(38.55 శాతం) ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ మూడో స్థానానికి పడిపోయారు. యాష్కీకి 69,240 (6.52 శాతం) ఓట్లు వచ్చాయి.

■ జహీరాబాద్ లోక్‌సభ స్థానంలో గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన బీబీపాటిల్, కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌పై స్వల్ప తేడాతో గెలుపొందారు. బీబీపాటిల్‌కు 4,34,244 (42 శాతం) ఓట్లు వచ్చాయి. మదన్‌మోహన్‌కు 4,28,015 (41 శాతం) ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి బాణాల లక్ష్మారెడ్డికి 1,38,947 (13 శాతం) ఓట్లు వచ్చాయి.

■ తాజా ఎన్నికల్లో సమీకరణలు పూర్తిగా మారిపోయాయి. గత శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ అధికారం చేజిక్కించుకుంది. శాసనసభ ఎన్నికల తరువాత ఐదు నెలల తేడాతో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ నడిచినప్పటికీ రెండు జాతీయ పార్టీల మధ్యే నువ్వా నేనా అనే స్థాయిలో పోరు జరిగింది. జాతీయ స్థాయి ఎన్నికలు కావడంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ గట్టిగానే తలపడ్డాయి. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ ఓట్లు ఎటువైపు క్రాస్ అయ్యాయనే విషయమై నాయకులు, కార్యకర్తలు సెగ్మెంట్ల వారీగా లెక్కలు వేసుకునే పనిలో ఉన్నారు.

■ జహీరాబాద్ స్థానంలో బీజేపీ తరఫున సిట్టింగ్ ఎంపీ బీబీపాటిల్, కాంగ్రెస్ నుంచి సురేశ్ షెట్కార్, బీఆర్‌ఎస్ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్ బరిలో ఉన్నారు. కేంద్రంలో అధికారంలో ఉండడంతో పాటు ప్రధాని మోదీ హవా నడుస్తున్న నేపథ్యంలో సిట్టింగ్ అభ్యర్థి బీబీ పాటిల్ గట్టి పోటీ ఇచ్చారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ సైతం విజయంపై ధీమాతో ఉన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి బలమైన బీసీ వర్గానికి చెందినప్పటికీ బీఆర్‌ఎస్ ఓట్లు క్రాస్ అయినట్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ ఓట్లను రెండు జాతీయ పార్టీలు ఎంత మేరకు రాబట్టుకున్నాయనే విషయమై స్పష్టత లేదు. దీంతో ఈ ఫలితంపై ఉత్కంఠ నెలకొంది.

■ నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ అభ్యర్థి సిట్టింగ్ ఎంపీ అర్వింద్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పసుపు బోర్డు ఏర్పాటుకు ప్రధాని మోదీతో ప్రకటన చేయించారు. మోదీ మేనియా ఈ నియోజకవర్గంలో భారీగా ఉంది. దీంతో తనకు మంచి మెజారిటీతో గెలుపు దక్కనుందనే ధీమాతో అర్వింద్ ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డి సైతం తనకు సైలెంట్ ఓటింగ్ నమోదైందని గెలుపుపై నమ్మకంతో ఉన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ తనకు వచ్చే ఓట్ల విషయమై అంచనాలు వేసుకుంటున్నారు. అయితే బీఆర్‌ఎస్ ఓట్లు బాగా క్రాస్ అయ్యాయని, ఈ ఓట్లు తమకే పడ్డాయని బీజేపీ అంటోంది. తమకు సైలెంట్‌గా ఓట్లు పడ్డాయని కాంగ్రెస్ అంటోంది. ఈ నేపథ్యంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

న్యూస్‌రీల్

విద్యార్థులకు ఇబ్బందులు కలగొద్దు



నిజామాబాద్‌రూరల్: పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని జెడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జెడ్పీ కార్యాలయంలో విద్య, వైద్యం, మహిళా స్త్రీశిశు సంక్షేమంపై స్థాయీ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ విఠల్‌రావు మాట్లాడుతూ.. పాఠశాలల పునఃప్రారంభం కానుండడంతో మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు సుమలత, శంకర్, యమున, కమల, కో–ఆప్షన్ సభ్యులు మోయిజ్, సీఈవో బి.ఉష, డిప్యూటీ సీఈవో సుందర వరదరాజన్, డీఆర్‌డీవో సాయన్న, డీపీవో తరుణ్, డీఎస్‌వో చంద్రప్రకాశ్, జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి ముత్తన్న వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలందించిన అధికారులకు సన్మానం



నిజామాబాద్‌నాగారం: విద్యుత్ శాఖలో వినియోగదారులకు ఉత్తమ సేవలందించిన ఉమ్మడి జిల్లా అధికారులను ఎన్పీడీసీఎల్ సీజీఎం నిజామాబాద్ జిల్లా నోడల్ ఆఫీసర్ అశోక్, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ రవీందర్‌లు బుధవారం సన్మానించారు. బుధవారం నగరంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా ఉత్తమ డీఈగా ఎం.శ్రీనివాసరావు(నిజామాబాద్ డివిజన్), అర్బన్ ఏడీఈ పైడి వీరేశం(టౌన్–3), రూరల్ ఏడీఈ జనార్దన్, ఆర్మూర్ ఏడీఈ శ్రీధర్, ఏఈ జపా ఆశ్రితరెడ్డి (ఆర్మూర్ టౌన్- 2), ఉత్తమ రూరల్ ఏఈ దారం ప్రవీణ్ కుమార్(నవీపేట్)లను సత్కరించారు. కార్యక్రమంలో డీఈ టెక్నికల్ వెంకటరమణ, డీఈలు జాడే ఉత్తం, పీవీ రాజేశ్వరరావు, హరిచంద్ర నాయక్, ఎస్‌ఏవో శ్రీనివాస్, ఏడీఈలు ప్రశాంత్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, చంద్రశేఖర్, తోట రాజశేఖర్, సుహాసిని, జి.శ్రీనివాస్, ఆర్.బాలేష్ కుమార్, ఎన్.రాజేశ్వర్, ఆర్.శ్రీధర్, బి.వినోద్ పాల్గొన్నారు.

పనులను వేగంగా పూర్తిచేయాలి



నిజామాబాద్ అర్బన్: ప్రభుత్వ బడుల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద జరుగుతున్న పనులను వేగవంతంగా పూర్తిచేయాలని డీఈవో దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని రాజీవ్ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు పనులన్నీ పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. పనులు నాణ్యతగా ఉండాలన్నారు. ఇంజనీరింగ్ అధికారులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

పాల్దా సొసైటీ చైర్మన్‌గా శ్రీనివాస్



నిజామాబాద్‌రూరల్: మండలంలోని పాల్దా సొసైటీ నూతన చైర్మన్‌గా కే శ్రీనివాస్ ఎన్నికయ్యారు. నిజామాబాద్ జిల్లా కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్టర్ దేవకళ ఆధ్వర్యంలో బుధవారం చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. 11 మంది సభ్యులు శ్రీనివాస్‌కు మద్దతు తెలుపడంతో అదేవిధంగా చైర్మన్ పదవికి నామినేషన్ ఒక్కటే రావడంతో శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ఆమె ప్రకటించారు. అనంతరం నియమకపత్రాలను శ్రీనివాస్‌కు అందజేశారు. అనంతరం సొసైటీ డైరెక్టర్లు నూతన చైర్మన్‌ను శాలువ, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. డైరెక్టర్లను చైర్మన్ సన్మానించారు. గతంలో చైర్మన్‌గా పనిచేసిన గాడి జితేందర్ వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేశారు.

పసుపు పంట అభివృద్ధిపై ఎంపీ అర్వింద్‌కు నివేదిక



అర్వింద్‌కు నివేదిక అందిస్తున్న తిరుపతిరెడ్డి

సుభాష్‌నగర్: మేఘాలయలో పర్యటించి పసుపు ఉత్పత్తులపై తయారు చేసిన నివేదికను పసుపు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు, బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు పాట్కూరి తిరుపతిరెడ్డి బుధవారం ఎంపీ అర్వింద్‌ను తన నివాసంలో కలిసి అందజేశారు. ముఖ్యంగా మార్కెట్‌లో ఆలూ చిప్స్ ఎలాగైతే విక్రయిస్తున్నారో.. భవిష్యత్‌లో పసుపు చిప్స్ తయారు చేసి అమ్మాలనే ఆలోచన ఉందని అక్కడి రైతులు, ఆదర్శ రైతు, పద్మశ్రీ అవార్డు గ్రహీత ట్రినిటీ సాయి వివరించారని ఎంపీ దృష్టికి తెచ్చారు. పసుపు చిప్స్ తయారు చేసి విక్రయిస్తే.. మార్కెట్‌లో వినియోగం పెరిగి పంటకు మరింత ధర వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. ఈ విషయమై ఉత్పత్తుల ఆధారంగా దేశంలో పసుపు పండించే రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందన్నారు. దేశంలోనే నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో అత్యధికంగా పసుపు సాగవుతున్న దృష్ట్యా దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేసేందుకు రైతులతో కమిటీ వేయాలని, రైతులకు మంచి ధరతోపాటు దిగుబడి పెంచే విధంగా చొరవ తీసుకోవాలని తిరుపతిరెడ్డి ఎంపీ అర్వింద్‌ను కోరారు. ఈ అంశాలపై ఎంపీ సానుకూలంగా ఉన్నారని, రాబోయే రోజుల్లో పసుపు రైతులకు మంచి లాభాలు వచ్చేలా తోడ్పాటునందిస్తానని హామీనిచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అంతరెడ్డి హరీశ్‌రెడ్డి, నాయకులు నాజర్, తదితరులు పాల్గొన్నారు.

‘ఈ-నామ్’ అమలు తీరు పరిశీలన



పసుపు గ్రేడింగ్ విధానాన్ని పరిశీలిస్తున్న సలహాదారులు

సుభాష్‌నగర్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ–నామ్ అమలు తీరును జాతీయ అడిషనల్ ఎకనమిక్ అడ్వయిజర్ (ఐఈఎస్) కె కావైరసన్ ఆధ్వర్యంలో ఢిల్లీ నుంచి వచ్చిన ఎకనమిక్, అగ్రికల్చర్ మార్కెటింగ్ సలహాదారులు బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా మార్కెట్‌లో పసుపు, ఆమ్‌చూర్, ఇతర పంటల క్రయవిక్రయాలను యార్డులో తిరిగి క్షేత్రస్థాయిలో సందర్శించారు. రైతుల అభిప్రాయాలు, వ్యాపారుల సలహాలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు. పంట యార్డుకు వచ్చినప్పటి నుంచి ఈ–నామ్‌లో అన్ని ప్రక్రియలను ప్రొజెక్టర్ ద్వారా మార్కెటింగ్‌శాఖ అధికారులు వివరించారు. అనంతరం పసుపు గ్రేడింగ్ పరిశీలన, కుర్కుమిన్ శాతం తెలిపే యంత్రం, పసుపు నాణ్యత, తదితర వివరాలను బృందానికి తెలియజేశారు. బృందంలో జాతీయ అగ్రికల్చర్ మార్కెటింగ్ డిప్యూటీ అడ్వయిజర్ ఎం జవర్, మార్కెటింగ్ ఇంటలిజెన్స్ యూనిట్ అసిస్టెంట్ ఎకనమిక్ అడ్వయిజర్ శశిరాజన్ వర్మ, ఎంఆర్‌ఐఎస్ పీఎండీ పీయూష్ ఉన్నారు. వారి వెంట రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ అడిషనల్ డైరెక్టర్ లక్ష్మణుడు, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ హర్ష, సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వెంకటేశం, నిజామాబాద్, కామారెడ్డి డీఎంవోలు గంగు, రమ్య, మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కమల్ కిషోర్ ఇనానీ, వ్యాపారులు తదితరులున్నారు.

బ్లాక్‌మెయిల్ చేసి.. భయపెట్టి..

- స్కానింగ్ సెంటర్‌లో మహిళల అశ్లీల చిత్రాలు, వీడియోలు తీసిన ఆపరేటర్
- వాట్సాప్‌లో పోస్ట్‌చేసి బెదిరింపులు
- కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ జరుపుతున్న కమిటీ

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ‘అయ్యప్ప’ స్కానింగ్ సెంటర్‌లో మహిళల అశ్లీల చిత్రాలు, వీడియోల చిత్రీకరణ చేసిన ఆపరేటర్ బాధిత మహిళలను తీవ్ర వేధింపులకు గురిచేసినట్లు తెలిసింది. కొంతమంది తమ పరువును బజారుకీడ్చవద్దని వేడుకున్నప్పటికీ నిందితుడు బ్లాక్ మెయిలింగ్‌తో భయపెట్టినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడైన స్కానింగ్ సెంటర్‌లోని ఆపరేటర్‌ను పోలీసులు ఇది వరకే అరెస్టు చేశారు. స్కానింగ్ సెంటర్‌లో రోగుల ఫోన్ నంబర్లను నిర్వాహకులు నమోదు చేస్తారు. స్కానింగ్ కోసం వచ్చిన మహిళల అశ్లీల ఫొటోలు, వీడియోలను వారికి తెలియకుండా తీసి నిందితుడు వారి ఫోన్ నంబర్లకు పంపించే వాడు. తనకు సన్నిహితంగా ఉండాలని లేకపోతే సోషల్ మీడియాలో పెడతానంటూ బెదిరింపులకు పాల్పడేవాడు. పోలీసులు నిందితుడి సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని వీడియోలు, మెసేజ్‌ల ఆధారంగా విచారణ జరుపుతున్నారు.

విచారణ ప్రారంభించిన కమిటీ

జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో నలుగురితో కూడిన విచారణ కమిటీ వేశారు. బుధవారం కమిటీ సభ్యులు అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌కు వెళ్లి విచారణ జరిపి వివరాలు సేకరించారు. మరింత క్షేత్రస్థాయిలో విచారణ చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పోలీసుల వద్ద ఇప్పటికే అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌లో జరిగిన ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం ఉంది. ఇదిలా ఉండగా ఐఎంఏ సభ్యులు కొందరు డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్‌ను, కలెక్టర్‌ను కలిసి సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరినట్లు తెలిసింది. స్కానింగ్ సెంటర్‌లో జరిగి ఘటన సంబంధిత వైద్యునికి తెలియదని, ఆపరేటరే పూర్తి బాధ్యుడని స్పష్టం చేసినట్లు తెలిసింది. అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌లో జరిగిన ఘటనపై ‘సాక్షి’లో కథనాలు సైతం వెలువడ్డాయి.

నిందితుడి అరెస్టు

ఖలీల్‌వాడి: అయ్యప్ప స్కానింగ్ సెంటర్ ఘటన కేసులో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తెలిపారు. సీపీ తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడారు. స్కానింగ్ సెంటర్‌లో ఘటనపై 20 రోజుల క్రితం ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. నిందితుడి నుంచి సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని, అందులో ఇద్దరి మహిళలకు సంబంధించిన వీడియోలు ఉన్నాయన్నారు. నిందితుడు ఇద్దరు మహిళలను బెదిరించినట్లు తెలిపారు. అన్ని స్కానింగ్ సెంటర్ లను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కమిటీ పరిశీలిస్తుందన్నారు. స్కానింగ్ సెంటర్లలో మెడికల్, నాన్ మెడికల్ సిబ్బందిపై నిర్వాహకులు దృష్టి పెట్టాలన్నారు. ప్రజలు స్కానింగ్ సెంటర్ వెళ్లినప్పుడు ఇబ్బందికరమైన పరిస్థితులు ఉంటే పోలీసులను సంప్రదించాలన్నారు.

స్కానింగ్ సెంటర్‌ను సీజ్ చేయాలి



మాట్లాడుతున్న నూర్జహాన్

నిజామాబాద్‌నాగారం: స్కానింగ్ పేరుతో మహిళల అశ్లీల చిత్రీకరణ చేసిన అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌ను వెంటనే సీజ్ చేయాలని, అధికారులు కమిటీల పేర్లతో కాలయాపన చేయొద్దని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. మహిళలు రోగం వచ్చి స్కానింగ్ కోసం వెళ్తే ఆపరేటర్ ప్రశాంత్ కీచక పర్వానికి పాల్పడ్డాడని ఆరోపించారు. ఇటీవల మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన కామారెడ్డి డీఎంహెవోను అరెస్టు చేసి ఉద్యోగం నుంచి భర్త రఫ్ చేయాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, నాయకులు మీనా తదితరులు పాల్గొన్నారు.

బాధితులు నష్టపరిహారం పొందవచ్చు



వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

అయ్యప్ప స్కానింగ్ సెంటర్ బాధితులు వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేస్తే వారి మానసిక వేదనకు నష్టపరిహారం పొందే అవకాశం ఉందని వినియోగదారుల మండలి జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్ తెలిపారు. బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదుతో పాటు వినియోగదారుల మండలి రాష్ట్ర కమిటీ scpconsumer@gmail.com, 94403 28239 నంబరుకు వాట్సాప్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. స్కానింగ్ సెంటర్ తతంగంపై చర్యలు తీసుకోవాలని బుధవారం అనిల్‌తో పాటు మండలి ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్, సంయుక్త కార్యదర్శులు మహాదేవుని శ్రీనివాస్, గైని రత్నాకర్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అడ్మినిస్ట్రేషన్ అధికారికి ఫిర్యాదు చేశారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి




మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం ప్రవీణ్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న ఫొటోగ్రఫీ – వీడియోగ్రఫీతో పాటు ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఇస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని నాబార్డు డీడీఎం ప్రవీణ్ సూచించారు. డిచ్‌పల్లిలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ(ఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని గ్రామీణ ప్రాంత నిరుద్యోగ అభ్యర్థులకు శిక్షణ తరగతులను బుధవారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆర్‌ఎం నవీన్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీడీఎం మాట్లాడుతూ.. యువకులకు ఫొటోగ్రఫీ- వీడియోగ్రఫీ, ఎలక్ట్రీషియన్ శిక్షణ ద్వారా భవిష్యత్‌లో మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఆర్‌ఎం మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, ఆఫీస్ సిబ్బంది, గెస్ట్ ఫాకల్టీలు పాల్గొన్నారు.

‘గోల్డెన్’ అవర్..!

- సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే స్పందించాలి
- 1930 టోల్‌ఫ్రీకి ఫోన్‌చేసి ఫిర్యాదు చేస్తే సొమ్ము రికవరీ చేయొచ్చు



ఖలీల్‌వాడి: నగరానికి చెందిన ఓ బాధితుడు సైబర్ నేరగాళ్ల చేతిలో రూ. 20 లక్షలు మోసపోయారు. వెంటనే సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌కు రావడంతో పోలీసుల సూచన మేరకు డయల్ 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయించారు. దీంతో రూ. 20 లక్షలను సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా పోలీసులు ఫ్రీజ్ చేశారు. బాధితుడికి రూ. 20 లక్షలు తిరిగి అందించారు. సైబర్ మోసం జరిగిన వెంటనే స్పందిస్తే ఇలా డబ్బులు రికవరీ చేసే అవకాశం ఉంటుంది. సైబర్ నేరగాళ్ల చేతిలో డబ్బులు పోగొట్టుకున్న బాధితులు అర గంట, గంటలోపు టోల్‌ఫ్రీ నంబర్ 1930 ఫోన్ గాని www.cybercrime.gov.inకు మెయిల్ గాని చేస్తే డబ్బులను ఫ్రీజ్ చేస్తారు. దీనినే డైమండ్ అవర్, గోల్డెన్ అవర్‌గా పేర్కొంటున్నారు.

చదువుకున్న వారే అధికం..

జిల్లాలో ఇటీవల సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. మోసగాళ్లు వివిధ పద్ధతుల్లో ప్రజలను బోల్తా కొట్టిస్తున్నారు. ఇందులో ఎక్కువగా ఖాతాల నుంచి డబ్బులు పోతున్నట్లు సైబర్ పోలీసులు గుర్తించారు. ఇలా మోసపోయిన వారిలో ఎక్కువ మంది ఉద్యోగులు, యువతీ, యువకులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే ఉండడం గమనార్హం.

మెయిల్ లేదా ఫోన్‌చేస్తే చాలు

బాధితులు మోసపోయినట్లు గ్రహిస్తే వెంటనే ‘1930’ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేయాలి. ఎన్సీఆర్పీ(నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్)లో ఫిర్యాదు నమోదు చేయాలి. ఆది అరగంట, గంట సమయంలో చేస్తే బాధితులకు న్యాయం జరుగుతుంది. బాధితుల ఖాతాలో నుంచి నగదు నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లకుండా హోల్డ్ చేస్తారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ‘సైబర్ వారియర్స్’ అందుబాటులో ఉన్నారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో గత మూడేళ్లలో చాలామంది సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన అరగంట, గంట సేపు ఫిర్యాదు చేసే 90 నుంచి 100 శాతం రికవరీ అవకాశం ఉంటుంది అవుతుంది. ఆరు గంటల వరకైతే 60 శాతం, ఆ తర్వాత కేవలం 30 శాతం వరకే రికవరీ చేసే చాన్స్ ఉంటుంది.

జిల్లా కేంద్రంలో సైబర్ పోలీస్‌స్టేషన్

నిజామాబాద్ కమిషనరేట్‌లో ఏప్రిల్ 2న సైబర్ పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించారు. స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోగా ఏసీపీ, ఇద్దరు ఎస్సైలు, సరిపోయే పోలీసు సిబ్బందిని నియమించారు. స్టేషన్‌లో ఇప్పటి వరకు 25 కేసులు నమోదు కాగా రూ. 31.70 లక్షలు రికవరీ చేశారు. 1930 ట్రోల్ ఫ్రీ నంబర్ ద్వారా రూ. 20 లక్షలు రికవరీ చేసి బాధితులకు తిరిగిచ్చారు. రూ. లక్షలోపు నష్టపోతే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. రూ. లక్షకు పైగా నష్టపోతే సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది.

స్మార్ట్‌ఫోన్‌లో వచ్చే లింకులు ఓపెన్ చేయవద్దు

స్మార్ట్‌ఫోన్‌లో వచ్చే అనవసర లింకులు, యాప్‌లు ఓపెన్ చేయవద్దని సైబర్ క్రైం పోలీసులు చెబుతున్నారు. అలాగే సోషల్ మీడియా యాప్‌లు ఇన్‌స్టాల్ చేసిన తర్వాత వ్యక్తిగత వివరాలతో పాటు బ్యాంక్ వివరాలను పొందపర్చవద్దని సూచిస్తున్నారు. లక్కీ లాటరీలో మొబైల్ నంబర్ వచ్చిందని లింకులు వస్తే ఓపెన్ చేయవద్దని పేర్కొంటున్నారు. దీంతో పాటు మ్యాట్రిమోనీ పేరిట, కాల్‌గర్ల్స్ కాల్స్, ఆన్‌లైన్ గేమ్స్, కేవైసీ పేరిట ఫోన్లు చేస్తూ మోసాలకు పాల్పడతారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అనుమానాస్పద లింకులు ఓపెన్ చేసినా, క్యూఆర్ కోడ్ స్కాన్ చేసినా ఖాతాల్లోంచి నగదు మాయమవుతుందని చెబుతున్నారు. డెబిట్, క్రెడిట్ కార్డులు, బ్యాంకు ఖాతాలు, ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దని పేర్కొంటున్నారు.

వెంటనే ఫిర్యాదు చేయాలి

సైబర్ మోసగాళ్ల చేతిలో ఎక్కువగా చదువుకున్నవారే మోసపోతున్నారు. డబ్బులు నష్టపోతే అరగంట, గంటలోపు డయల్ 1930కు ఫోన్‌చేస్తే బాధితులకు న్యాయం జరుగుతుంది. సైబర్ నేరగాళ్లకు సంబంధించిన ఖాతాను ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుంది. అర గంటను డైమండ్, గంటను గోల్డెన్ అవర్ అవుతుంది. – వెంకటేశ్వర్, ఏసీపీ, సైబర్ క్రైం

క్లుప్తంగా

ముగ్గురిపై మాల్ ప్రాక్టీస్ కేసు

నిజామాబాద్అర్బన్: నిజామాబాద్ జిల్లాలో బుధవారం ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో మొదటి సంవత్సరం విద్యార్థి, ఇద్దరు రెండో సంవత్సరం విద్యార్థులు మాల్ ప్రాక్టీస్ చేస్తూ పట్టుబడ్డారని జిల్లా ఇంటర్ విద్యా అధికారి శ్రీ రవికుమార్ తెలిపారు. డిచ్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం ఒక విద్యార్థి, మధ్యాహ్నం ఇద్దరు విద్యార్థులు చీటీలతో కాపీయింగ్ చేస్తుండగా దొరికారు. బుధవారం గణితం, జువాలజీ, హిస్టరీ పరీక్షలు జరిగాయి. మొదటి సంవత్సరం పరీక్షలకు 8,468 మంది విద్యార్థులకు గాను 8,102 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని జిల్లా ఇంటర్ విద్యాధికారి తెలియజేశారు. మధ్యాహ్నం రెండోవ సంవత్సరం పరీక్షలకు 2,800 మంది విద్యార్థులకు గాను 2,690 మంది హాజరయ్యారు.

కొనసాగుతున్న డిగ్రీ పరీక్షలు

తెయూ(డిచ్పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్లాగ్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. నిజామాబాద్ నగరం నిశిత కామర్స్ డిగ్రీ కాలేజ్ పరీక్షా కేంద్రంలో మాల్ ప్రాక్టీస్కు పాల్పడుతూ ఒక విద్యార్థి డిబార్ అయినట్లు ఆయన తెలిపారు. వర్సిటీ పరిధిలో 38 కేంద్రాల్లో ఉదయం జరిగిన డిగ్రీ 4వ సెమిస్టర్ రెగ్యులర్, 5వ సెమిస్టర్ బ్యాక్లాగ్ పరీక్షలకు 7,258 మంది విద్యార్థులకు గానూ 6,765 మంది హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం జరిగిన 2వ సెమిస్టర్ రెగ్యులర్, 3వ సెమిస్టర్ బ్యాక్లాగ్ పరీక్షలకు 9,890 మంది విద్యార్థులకు గానూ 9,261 మంది హాజరైనట్లు తెలిపారు. ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్, జాయింట్ డైరెక్టర్ అతిక్ సుల్తాన్ ఘోరీ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.

బాలల సాహిత్య సమ్మేళనానికి సమన్వయకర్తగా నాగరాజు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మంథని ప్రభుత్వ పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కోకిల నాగరాజు రాష్ట్ర స్థాయి బాలల సాహిత్య సమ్మేళనానికి సమన్వయకర్తగా వ్యవహరించడానికి తెలంగాణ సారస్వత పరిషత్తు నుంచి ఆహ్వానం లభించింది. హైదరాబాద్లో ఈ నెల 29, 30 తేదీల్లో సమ్మేళనం నిర్వహిస్తున్నారు. 2 రోజుల పాటు నిర్వహించే సమ్మేళనంలో బాలల సాహిత్యం కోసం సేవలు చేస్తున్న రచయితలు, వక్తలు ప్రసంగించనున్నారు.

మదర్హుడ్ ఆస్పత్రికి ఎస్సీ, ఎస్టీ కమిషన్ నోటీసు

నిజామాబాద్నాగారం: అవసరం లేకున్నా ఆపరేషన్ చేశారని నవీపేట్ మండలానికి చెందిన ఆశాతాయి ఎస్సీ, ఎస్టీ కమిషన్ను ఆశ్రయించడంతో బుధవారం నగరంలోని మదర్హుడ్ ఆస్పత్రికి నోటీసు జారీ చేశారు. ఇదివరకే జిల్లా కలెక్టర్కు, డీఎంహెచ్వోకు సైతం విన్నవించారు. ఆరోగ్యం బాగాలేదని ఆస్పత్రికి వస్తే రొమ్ము క్యాన్సర్ ఉందని, ఆపరేషన్ చేయాలని వైద్యులు భయభ్రాంతులకు గురి చేశారన్నారు. తన భర్త ప్రభుత్వ ఉద్యోగి కావడంతో రీయంబర్స్మెంట్ కోసం వెళ్లితే అదనంగా రూ.లక్ష చెల్లించాలని బెదిరించారని ఆరోపించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

బోధన్టౌన్(బోధన్): డ్రంకెన్ డ్రైవ్ కేసులో బోధన్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ శేష తల్పసాయి బుధవారం ముగ్గురికి జైలు శిక్ష విధిస్తూ తీర్పు ను వెల్లడించినట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో 3 రోజుల జైలు శిక్ష విధించినట్లు చెప్పారు.

మొరం టిప్పర్ పట్టివేత

రుద్రూర్: పోతంగల్ మండలం చేతన్నగర్ శివారులో అనుమతి లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్ను బుధవారం సాయంత్రం పట్టుకుని కోటగిరి పోలీస్స్టేషన్కు తరలించినట్లు తహసీల్దార్ మల్లేష్ తెలిపారు. తగు చర్యల నిమిత్తం సంబంధిత అధికారులకు సమాచారం అందించామన్నారు. అనుమతి లేకుండా మొరం, ఇసుక తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మృత్యు కూపాలుగా చెరువులు

- గాలిలో కలుస్తున్న ప్రాణాలు
- చూసీచూడనట్లుగా అధికారులు
- మొరం గుంతల్లో ప్రమాదవశాత్తు పడి వారం రోజుల వ్యవధిలో 8 మంది మృతి


వల్లభాపూర్ చెరువులో మొరం కోసం తవ్విన గుంతలు

మాక్లూర్: చెరువుల్లో మొరం తీయగా ఏర్పడిన భారీ గుంతల కారణంగా ఆ చోట గుంత ఉన్న విషయం తెలియక అనేక మంది ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందుతున్న ఘటనలు మండలంలోని ఆయా గ్రామాల్లో ఇటీవల కాలంలో నిత్యకృత్యం అవుతున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు చెరువుల్లో జరుగుతున్న అడ్డగోలు తవ్వకాలపై చర్యలు తీసుకోవటంలో విఫలమువుతున్నారనే విమర్శలు ఆయా గ్రామాల ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. గత నెలలో ఒడ్డేట్పల్లి చెరువులో స్నానానికని వెళ్లి ప్రమాదవశాత్తూ మొరం గుంతలో పడి అదే గ్రామానికి చెందిన నరేష్, మహేష్, సాయితేజ అనే యువకులు మృతి చెందారు. అంతకు ముందు మదన్పల్లికి చెందిన లక్ష్మి అదే మొరం గుంతలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందారు. తాజాగా ఈ నెల 26న కొత్తపల్లి చెరువులోనికి పశువులను తీసుకుని వెళ్లిన 22 సంవత్సరాల పశువుల కాపరి పశువులను శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు మొరం గుంతలో పడి మృతి చెందాడు. 27వ తేదీ సాయంత్రం రాంచంద్రపల్లికి చెందిన జ్వాల దుర్గయ్య(65) అనే పశువుల కాపరి సింగ సముద్రం చెరువులో ఉన్న పశువులను బయటకు తీసే క్రమంలో ప్రమాదవశాత్తూ మొరం గుంతలో పడి మృతి చెందాడు. ఈ నెల 28న మండలంలోని చిక్లీ చెరువులో యువతి ప్రమాదవశాత్తు మొరం గుంతలో పడి గల్లంతు కాగా ఆ యువతి శవం బుధవారం తేలింది. అంతే కాకుండా మండలంలోని అడవి మామిడిపల్లి, వల్లభాపూర్, గుంజ్లి, రాంచంద్రాపల్లి తదితర చెరువులు గ్రామాలకు అతి సమీపంలో ఉండటం మొరం వ్యాపారులు వాటినే ఎంచుకుని అడ్డగోలుగా మొరం తవ్వకాలు జరిపి వ్యాపారం చేసుకోవటం జరుగుతోంది. మొరం తీయగా ఏర్పడిన భారీ గుంతలను అలాగే వదిలేస్తున్నారు. నిలువెత్తు లోతుగా ఉండటంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయనే విమర్శలు స్థానికుల నుంచి వస్తున్నాయి. అసలు విషయం ఏమిటంటే మొరం గుంతలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే మొరం వ్యాపారులు కొన్ని సందర్భాల్లో వెంటనే ఘటన స్థలానికి చేరుకుని తమ మీదికి వస్తుందన్న ఉద్దేశంతో హడావిడి చేసి పోస్టుమార్టం చేయించకుండానే గుట్టుగా దహన కార్యక్రమాలు పూర్తి చేయించేస్తున్నారు. మొరం వ్యాపారులు కొందరు గ్రామాభివృద్ధి కమిటీలకు మందు విందులు ఇచ్చి చెరువుల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిపి ప్రమాదాలు తెచ్చి పెడుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైన సంబంధిత తహసీల్దార్ చెరువుల్లో జరుగుతున్న తవ్వకాలపై తగిన చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గుంతగా తవ్వకూడదు



చెరువులో మొరం, మట్టి తీసేటప్పుడు గుంతగా తవ్వకూడదు. ఒకే లెవెల్లో తవ్వితే గుంతలు ఏర్పడవు. పైగా చెరువు పూడిక తీసినట్లు అవుతుంది. తద్వారా చెరువు లోతు పెరిగి నీటి నిలువ ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. మొరం వ్యాపారులు చెరువుల్లో ఇష్టారాజ్యంగా మొరం తవ్వకాలు జరపటంవల్ల పెద్ద గుంతలు ఏర్పడటం, ఆ విషయం తెలియక చెరువులోకి వెళ్లిన వారు ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందుతున్నారు. ఈ విషయంలో తహసీల్దార్ ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

– గంగాధర్, ఒడ్డేట్పల్లి, మాక్లూర్

కాంట్రాక్టర్లను మార్చాల్సిందే..?

- ఆస్పత్రుల్లో సానిటేషన్, కేర్టేకర్, సెక్యూరిటీ కాంట్రాక్టర్ల వ్యవహారం సరిగా లేదని ఫిర్యాదు
- కలెక్టర్కు లేఖ రాసిన వైద్య విధాన పరిషత్ అధికార యంత్రాంగం
- కాంట్రాక్టర్లను మార్చకపోతే రోగులకు సేవలు అందించడం కష్టమేనని వెల్లడి

మోర్తాడ్(బాల్కొండ): తొండ ముదిరి ఊసరవెల్లిగా మారింది అనే చందంలాగా ఉంది కొందరు కాంట్రాక్టర్ల నిర్వాకం. వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులలో సానిటేషన్, పేషెంట్ కేర్టేకర్, సెక్యూరిటీ విధులను పర్యవేక్షించే కాంట్రాక్టర్లు, అధికారుల మాటను లెక్కచేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూడు రకాల సేవలను అందించడానికి ఔట్ సోర్సింగ్ విధానంలో యువతీ యువకులను నియమించడానికి టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు మొదట్లో వినయం ప్రదర్శించి ఆ తర్వాత తమ ప్రతాపం చూపుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అధికార పార్టీ నేతల అండదండలు..

అధికార పార్టీ నేతలతో అంటకాగుతున్న కాంట్రాక్టర్లు వైద్య విధాన పరిషత్ అధికారుల మాటను పెడచెవిన పెట్టి తమకు నచ్చిన విధంగానే నడుచుకుంటున్నారు. ఫలితంగా ఆస్పత్రులలో రోగులకు అందాల్సిన సేవలలో తీవ్ర అంతరాయం కలుగుతోంది. వైద్య విధాన పరిషత్ పరిధిలో మోర్తాడ్, బాల్కొండ, డిచ్పల్లి, ధర్పల్లి, నవీపేట్, కోటగిరి, వర్నిలలో 30 పడకల ఆస్పత్రులు, బోధన్, ఆర్మూర్లలో వంద పడకల ఆస్పత్రులు, నిజామాబాద్లో సివిల్ ఆస్పత్రి ఉంది. 30 పడకల ఆస్పత్రులలో 13 మంది చొప్పున, వంద పడకల ఆస్పత్రిలో 41 మంది, జనరల్ ఆస్పత్రిలో 200ల మందిని మూడు రకాల సేవల కోసం ఔట్ సోర్సింగ్ విధానంలో సిబ్బందిని నియమించారు. ఈ సిబ్బందిని నేరుగా కాకుండా కాంట్రాక్టర్ల ద్వారానే నియమించి వారికే బిల్లులు చెల్లిస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలోనే కాంట్రాక్టు..

గత ప్రభుత్వ హయాంలోనే కాంట్రాక్టు ఏజెన్సీల సర్దుబాటు పూర్తయింది. అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలకు సన్నిహితులైన వారే ఏజెన్సీలను ఏర్పాటు చేసుకుని కాంట్రాక్టులు పొందారు. అధికార పార్టీ అండదండలు ఉన్నాయనే ఉద్దేశంతో అవసరం ఉన్నంత సిబ్బందిని నియమించలేదు. రిజిస్టర్లలో ఎక్కువ మంది సిబ్బంది పేర్లు నమోదు చేసి వారి పేరిట బిల్లులు లేపుతూ నామమాత్రంగానే ఉద్యోగులను నియమించారు. 30 పడకల ఆస్పత్రులలో 8 మందిని, వంద పడకల ఆస్పత్రిలో 20 మందిని నియమించి వారితోనే మూడు రకాల సేవలను కొనసాగిస్తున్నారు. కాంట్రాక్టర్లు తమ మాట వినడం లేదని బిల్లులు నిలిపివేస్తే అధికార పార్టీ నేతలతో జులుం చేయిస్తూ బిల్లుల కోసం తీవ్ర వత్తిడి తీసుకొస్తున్నారు. నిబంధనల ప్రకారం సిబ్బందిని నియమించాలని ఎంత చెప్పినా ఏజెన్సీల నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్లను మార్చాలని ఇటీవల జిల్లా కలెక్టర్కు అధికారులు లేఖ రాశారు. కాంట్రాక్టర్లను మార్చితేనే ఔట్ సోర్సింగ్ సిబ్బందిని సక్రమంగా నియమించుకునే ఏజెన్సీలు ముందుకు వస్తాయని అధికారులు భావిస్తున్నారు. ఎన్నికల కోడ్ కారణంగా ఏజెన్సీల కాంట్రాక్టు రద్దు కొత్తగా టెండర్ల నిర్వహణకు బ్రేక్ పడిందని తెలుస్తోంది. ఏది ఏమైనా ఏజెన్సీల నిర్వాకం వల్ల ఆస్పత్రులలో రోగులకు అందాల్సిన సేవలకు అంతరాయం కలుగుతోంది.

కోడ్ ముగిసిన తర్వాత నిర్ణయం

ఎన్నికల కోడ్ కారణంగా ఆస్పత్రులలోని ఏజెన్సీ కాంట్రాక్టులను రద్దు చేయడం లేదు. నిబంధనలను పాటించని కాంట్రాక్టు ఏజెన్సీలపై జిల్లా కలెక్టర్కు లేఖ రాశాం. కోడ్ ఎత్తివేసిన తర్వాత కొత్తగా టెండర్లను నిర్వహించి ఏజెన్సీలకు కాంట్రాక్టు ఇస్తాం.

– శివశంకర్, డాక్టర్, జిల్లా వైద్య విధాన పరిషత్

క్రైం కార్నర్

మంజీరలో స్నానానికి వెళ్లి ఇద్దరి మృతి

- ఇసుక కోసం తవ్విన గుంతల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వైనం


పండరి(ఫైల్),


ఆజాం(ఫైల్)

బాన్సువాడ: మంజీర నదిలో స్నానానికి వెళ్లి న్యాంతాబాద్ పండరి(30), ఆజాం(12) అనే ఇద్దరు మృతి చెందారు. బీర్కూర్కు చెందిన న్యాంతాబాద్ పండరి చికెన్ సెంటర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పండరి వద్ద ఆజాం అనే బాలుడు పని చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం మంజీరలో స్నానానికి పండరితో కలిసి నలుగురు మైనర్లు వెళ్లారు. మంజీరలో స్నానానికి ముందుగా ఆజాం నీటిలోకి దిగాడు. మిగతా ముగ్గురు మైనర్లు గట్టుపైనే ఉన్నారు. ఇసుక కోసం తవ్వకాలు చేపట్టడడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గుంతలను గమనించకుండా ఆజాం స్నానానికి దిగాడు. గుంత లోతు ఎక్కువగా ఉండడంతో నీట మునిగాడు. ఆజాంను కాపాడేందుకు వెళ్లిన పండరి కూడా నీటిలో మునిగిపోయాడు. గడ్డపై ఉన్న ముగ్గురు మైనర్లు గట్టిగ కేకలు వేయడంతో బ్రిడ్జిపై నుంచి వెళ్తున్న వారు గమనించి మంజీరలోకి దిగారు. కొద్ది సేపటికి పండరి మృత దేహం బయట పడింది. గజ ఈతగాళ్ల సాయంతో ఆజాం శవం వెలికితీశారు. ఇద్దరు మృతి చెందడంతో బీర్కూర్లో విషాదం నెలకొంది. పండరికి ఆరేళ్ల కుమార్తె ఉంది. పోలీసులు కేసు నమోదు చేశారు. మూడేళ్ల క్రితం ఇదే ప్రాంతంలో బిచ్కుంద మండలం శెట్లూరికి చెందిన ఓ తల్లి, ముగ్గురు కుమార్తెలు నీట మునిగి చనిపోయారు.

బిల్డింగ్పై నుంచి పడి హెడ్ కానిస్టేబుల్ మృత్యువాత


శ్రీనివాస్(ఫైల్)

ఖలీల్వాడి: నగరంలోని వర్ని రోడ్ సాయినగర్లో నివాసముంటున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ మంగళవారం కొత్తగా నిర్మిస్తున్న భవనం ఒకటో అంతస్తులో వాటర్ కొడుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో మృతి చెందినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. శ్రీనివాస్ బదిలీపై ఇందల్వాయి పోలీస్ స్టేషన్కు వచ్చినట్లు తెలిసింది. భవనం పై నుంచి పడిపోవడంతో తీవ్రగాయాలైన శ్రీనివాస్ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన ఎస్సై తెలిపారు. పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో హోటల్ కార్మికుడు..

భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం వేకువ జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో హోటల్ కార్మికుడు మృతి చెందినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపారు. మృతుడు రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన బాకర్ రామ్రామ్(54)గా గుర్తించారు. ఐదేళ్లుగా భిక్కనూరు సమీపంలోని బాబా రాందేవ్ దాబాలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం వేకువ జామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో బాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తల పూర్తిగా చిట్లిపోయింది. మృతుడి సోదరుడు లక్ష్మణ్ రామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి ..


మృతదేహం

నవీపేట: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి(46) మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు గమనించామని, కాలికి దవాఖానా పట్టీలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఫిట్స్ వచ్చినట్లు చేతి వేళ్లు బిగుసుకుపోయాయని ఎస్సై వెల్లడించారు.

భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని ఆత్మహత్య


మృతుడు రాజు

డిచ్పల్లి: భార్య తనతో గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయి తిరిగి రాలేదని, జీవితంపై విరక్తి తో పురుగు మందు తాగి మగ్గిడి రాజు(39) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు డిచ్పల్లి ఎస్సై మహేష్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు.. డిచ్పల్లి మండలం మెంట్రాజ్పల్లి గ్రామానికి చెందిన రాజు భార్య ఆయనతో గొడవ పడి రెండేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో రాజు ఒక్కడే ఉంటున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి పురుగు మందు తాగాడు. గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్లో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి తల్లి పోసాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆశావర్కర్ ఆత్మహత్యాయత్నం

బోధన్: సాలూర మండల కేంద్రానికి చెందిన ఆశావర్కర్ సునీత మంగళవారం ఇంట్లో పురుగు మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబీకులు గమనించి వెంటనే చికిత్స కోసం బోధన్ జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించగా ఆమె కోలుకుని బుధవారం సాయంత్రం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యింది. ఇదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఉద్యోగం నుంచి తొలగించేస్తామని ఇబ్బందులకు గురి చేస్తున్నందున ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ప్రచారం జరుగుతోంది.

శబ్ద కాలుష్యం చేస్తున్న బుల్లెట్ బైక్ల సీజ్



కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణ పరిధిలో ఎక్కువ మోతాదులో శబ్ద కాలుష్యం చేస్తున్న బుల్లెట్ బైక్లపై బుధవారం పట్టణ సీఐ చంద్రశేఖర్రెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ మేరకు 12 బుల్లెట్ బైక్లను సీజ్ చేశారు. వాహనదారులు నిబంధనలకు అతిక్రమిస్తూ శబ్ద కాల్యుష్యానికి పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సీజ్ చేసిన బైక్లను పట్టణ పోలీస్ స్టేషన్కు తరలించారు.

హత్య కేసులో ఇద్దరు నిందితుల రిమాండ్

- మృతురాలి నగలు అమ్ముతుండగా పట్టుకున్న పోలీసులు
- అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్న నిందితులు


లక్ష్మి(ఫైల్)


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సింధు శర్మ(ఫైల్)

బాన్సువాడ రూరల్: అందంగా ఉన్న ఆ మహిళపై తొలుత మనసు పారేసుకున్నాడు. మాయమాటలతో మభ్యపెట్టాడు. ఆమె ఒంటిపై ఉన్న నగలను కాజేయాలనే దుర్బుద్ధితో మిత్రుని సాయంతో ప్రియురాలి తలపై బండరాయితో మోది హత్య చేసి పారిపోయాడు. నగలను విక్రయించడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో బుధవారం బాన్సువాడలో పోలీసులకు చిక్కడంతో నిందితులిద్దరూ కటకటాల పాలయ్యారు. బాన్సువాడ డీఎస్పీ టి. సత్యనారాయణ తెలిపిన వివరాలు.. బాన్సువాడ మండలంలోని కృష్ణానగర్ తండా సమీపంలోని అటవీ ప్రాంతంలో ఈ నెల 23న గాంధారి మండలం బూర్గుల్ గ్రామానికి చెందిన మాద లక్ష్మి(35) మృతదేహం లభ్యమైంది. మృతదేహం కుళ్లిపోయి అనుమానాస్పద స్థితిలో ఉండటంతో కామారెడ్డి ఎస్పీ సింధు శర్మ ఆదేశంతో పోలీసులు హత్యకోణంలో విచారణ ప్రారంభించారు. నెల రోజుల క్రితం గాంధారి మండలం నెరెల్ గ్రామానికి చెందిన కమ్మరి దత్తు, అతని మిత్రుడు సాయిప్రసాద్తో కలిసి వారాంతపు సంతకు వెళ్లినపుడు కూరగాయలు విక్రయించే మాద లక్ష్మి పరిచయం అయ్యింది. ఆమెను వారాంతపు సంతలో మరోసారి చూసినపుడు ఒంటిపై బంగారు నగలు ఉండటంతో వాటిని దోచుకుని అప్పులు తీర్చుకుందామని మిత్రులిద్దరు ప్లాన్ వేసుకున్నారు. ఈ నెల 16న బోర్లంక్యాంపునకు చేరుకుని లక్ష్మికి ఫోన్ చేసి రప్పించుకున్నారు. నర్సాపూర్ రోడ్డులో కల్లు తాగిన అనంతరం లక్ష్మి, దత్తు అటవీప్రాంతంలోకి వెళ్లి శారీరకంగా కలిశారు. సాయిప్రసాద్ బాన్సువాడకు వెళ్లి 3 బీర్లు, బిర్యానీ ప్యాకెట్లు తీసుకుని రావడంతో అక్కడి నుంచి కృష్ణానగర్ తండా సమీపంలోని అటవీ ప్రాంతంలో తినేసి వెళ్దామని నమ్మించి తీసుకెళ్లారు. బీర్లు తాగి బిర్యాని తిన్న తర్వాత ప్లాన్ ప్రకారం లక్ష్మి తలపై సాయిప్రసాద్ కర్రతో కొట్టగా కమ్మరి దత్తు బండ రాయిని తలపై మోది చంపేశాడు. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు తీసుకుని సమానంగా పంచుకున్నారు. దోచుకున్న నగలను బుధవారం బాన్సువాడలోని గాంధీచౌక్లో అమ్మడానికి ప్రయత్నిస్తుండగా నిందితులను అరెస్టు చేసి విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించారు. కేసు ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ సత్యనారాయణతో పాటు ఎస్సై చంద్రయ్య, ఏఎస్సై రాములు, హెడ్ కానిస్టేబుల్ సతీష్ ఇతర పోలీసు సిబ్బందిని అభినందించి రివార్డు ప్రకటించారు.

రూ.2 కోట్లతో వ్యక్తి పరారీ

ఆర్మూర్టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్లో నివాసముండే ఓ వ్యక్తి సుమారు రూ. 2 కోట్లతో పరారయ్యారు. పదేళ్లుగా పెర్కిట్లో కిరాణ వ్యాపారంతో పాటు చిట్టీల వ్యాపారం చేసేవారు. దీంతో పలువురు చిట్టీలు వేయగా మరికొందరు అప్పుగా డబ్బులు ఇచ్చారు. బాకీలు ఎక్కువగా ఉండటంతో కుటుంబ సభ్యులతో సహా పరారైనట్లు తెలిసింది. ఈ దీంతో అప్పు ఇచ్చినవారు, చిట్టీలు వేసిన బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఏడుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

డిచ్పల్లి: సుద్దపల్లి గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు డిచ్పల్లి ఎస్సై మహేష్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు.. ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన ఏడుగురు అదే గ్రామానికి చెందిన దళితుడు గుండా గంగ భూషణ్ ఇంటికి వెళ్లి అకారణంగా కులం పేరుతో దూషిస్తూ ఆయన కుటుంబీకులపై దాడి చేశారు. దీంతో బాధితుడు గంగ భూషణ్ ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కార్మిక నేతపై..

ఖలీల్వాడి: రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు వి.ప్రభాకర్పై నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. నగరంలోని అయ్యప్ప స్కానింగ్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. దీనిలో భాగంగా కేసు నమోదైనట్లు చేసినట్లు ఎస్హెచ్వో విజయ్ బాబు చెప్పారు.

డివైడర్ను ఢీకొట్టిన కారు

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం



బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్ శివారులో జాతీయ రహదారి-44పై మారుతీ సుజుకీ కారు డివైడర్ను ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న బాల్కొండ మండల కేంద్రానికి చెందిన నాగేంద్ర, అభిరామ్లకు తీవ్ర గాయలయ్యాయి. మెండోరా మండలం పోచంపాడ్కు వెళ్లి తిరుగు ప్రయాణంలో బాల్కొండ మండల కేంద్రానికి వస్తుండగా ప్రమాదం జరిగింది. అతి వేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్లో జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేటు ఆస్పపత్రికి తరలించారు. నాగేంద్ర పరిస్థితి విషమంగా ఉంది. మెండోరా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అల్ప్రాజోలం సప్లై చేస్తున్న ముగ్గురి అరెస్ట్

- రూ.12.50 లక్షల సొత్తు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

ఖలీల్వాడి/గాంధారి: అల్ప్రాజోలం సప్లై చేస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించినట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమయ్య తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. కల్తీ కల్లు తయారీలో కలిపే మత్తు పదార్థం అల్ప్రాజోలం రవాణా చేస్తున్నట్లు సమాచారం రావడంతో సోదాలు చేశామన్నారు. గాంధారి మండలం నాగ్లూర్ గ్రామానికి చెందిన దడిగే శేఖర్ గౌడ్ అనే వ్యక్తిని అదుపులో తీసుకొని విచారించగా రామారెడ్డికి చెందిన ఆకుల బైర గౌడ్ వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆకుల బైరవగౌడ్ను అదుపులోకి తీసుకొని విచారించగా దొమకొండకు చెందిన రాఘవపల్లి ప్రసాద్ గౌడ్ వద్ద కొనుగోలు చేశానని చెప్పారని, ఆయనను కూడా అదుపులోకి తీసుకుని విచారణ చేయగా వైజాగ్కు చెందిన కిరణ్ దగ్గర కొనుగోలు చేసినట్లు చెప్పారు. వీరి నుంచి 1,250 గ్రాముల అల్ప్రాజోలంతోపాటు ఒక బైక్ మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దీని విలువ రూ. 12.50 లక్షలు ఉంటుందని తెలిపారు. గంజాయి, అల్ప్రాజోలంతోపాటు ఇతర మత్తు పదార్థాలను ఎవరైనా సరఫరా చేస్తే అధికారులకు సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఎన్ఫోర్స్మెంట్ ఏడీ చంద్ర భాను నాయక్, ఎక్సైజ్ సీఐలు స్వప్న, వెంకటేష్, ఎస్సై నరసింహాచారి, హెడ్ కానిస్టేబుల్ చిట్టి నారాయణ రెడ్డి ఉన్నారు.

అటవీ ప్రాంతంలో అస్థి పంజరం లభ్యం

- ఘటనా స్థలంలో పురుగుల మందు, క్వార్టర్ సీసాలు
- ఆత్మహత్యగా కేసు నమోదు


అస్థి పంజరాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ ఐపీఎస్

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్నగర్ మండలం శేర్ఖాన్పల్లి శివారులోని మీదక్క చెరువు అటవీ ప్రాంతంలో బుధవారం అస్థి పంజరాన్ని పోలీసులు గుర్తించారు. అస్థి పంజరంపై ఉన్న ప్యాంటులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా మృతుడిని తుంకిపల్లి గ్రామానికి చెందిన గుమ్మడి రవీందర్(37)గా గుర్తించారు. ఘటనా స్థలాన్ని ట్రైనీ ఐపీఎస్ అధికారిణి కాజల్ సింగ్, బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ, బాన్సువాడ ఎస్హెచ్వో కృష్ణ పరిశీలించారు. మృతుడి బంధువులకు సమాచారమిచ్చినా ఎవరూ రాకపోవడంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని అటవీ ప్రాంతంలోనే పూడ్చి పెట్టారు. అస్థి పంజరం పక్కనే క్వార్టర్ సీసాలు, పురుగుల మందు బాటిల్ ఉండటంతో ఆత్మహత్యగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. రవీందర్కు భార్య, ఒక కుమార్తె ఉంది. భార్య మూడేళ్ల క్రితం అతనిని వదిలేసి వెళ్లిపోగా..కుమార్తెను వేరొకరికి అమ్మేసినట్లు స్తానికులు చెబుతున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



పగలగొట్టిన బీరువా ,తొలగించిన ఇంటి పైకప్పు

లింగంపేట(ఎల్లారెడ్డి): అయ్యపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి తాళం వేసిన ఇంట్లో చోరి జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన చల్ల దేవయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి లక్ష్మాపూర్ గ్రామంలోని అల్లుడు ఇంటికి బోనాల పండగకు వెళ్లారు. బుధవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో బీరువా పగులగొట్టి సామాన్లు చిందర వందరగా పడి ఉండడంతో తన ఇంట్లో దొంగలు పడినట్లు గుర్తించారు. వెంటనే లింగంపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి చోరీ జరిగిన తీరును పరిశీలించాడు. దేవయ్య ఇంటి పైకప్పులో ఉన్న ఇనుప సలాకాలను కోసేసి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. బీరువాలో ఉన్న 5 తులాల బంగారు నగలు, 60 తులాల వెండి, రూ.50 వేలు నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. క్లూస్ టీమ్తో వేలి ముద్రలు సేకరించినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.